


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

ఎవరా అనుకుంటూ వెళ్లిచూస్తే ఇంటి గుమ్మం బయట నిలబడి ఉన్నారు కాసింబర్గ్, క్రిస్టా లూథరూ.

వాన బాగా పడుతోందేమో, గొడుగులున్నా కూడా కారు దిగి గుమ్మందాకా వచ్చేసరికే బాగా తడిసిపోయారు. లోపలికొస్తే తప్ప ఇంటి గుమ్మం దగ్గర తల దాచుకునే చోటు లేదు.

నేను వెళ్లేసరికి బయట హోరు గాలి, చలి, వాన. వాళ్లింకా ఇంటిబయట నిలబడి తడుస్తూనే ఉన్నారు. 'యాకేల్‌వాళ్లను లోపలకు తీసుకురావాల్సింది' – అనుకున్నాను.

ఆ మధ్య కాసింబర్గ్ పెరూ వెళ్లిందిట. అప్పుడు కొన్ని స్లైడ్స్ తీసుకుందిట. అవి ప్రోసెసై ఇప్పుడు వచ్చాయిట. అవి చూద్దామనీ, ఓ గంటలో బయల్దేరి వాళ్లింటికి రమ్మనమనీ, ఈ విషయం ఇంకా నటరాజన్‌కి కూడా చెప్పాలనీ అని చెప్పి కార్లో హడావుడిగా వెళ్లిపోయారు.

తర్వాత తెలిసింది నాకు – ఈ దేశాల్లో అపరిచితుల్ని చటుక్కున ఇంట్లోకి రమ్మని ఆహ్వానించరని. చిత్రంగా అనిపించింది. మన దేశంలో ఐతే తలుపు కొట్టినవాళ్లని అపరిచితులైనా సరే – కనీసం మంచినీళ్లు కావాలా అనైనా అడుగుతాం. అలాగని మన సంస్కృతిని గొప్పగా అనుకునేందుకేం లేదు. సాటి మనిషి అడుక్కు తింటుంటే ఏమాత్రం పట్టించుకోకుండా మన వైభవాన్ని మనం కొనసాగించగలం. అది ఇక్కడ వీరికి చిత్రంగానే కాదు, అమానుషంగా కూడా ఉండొచ్చు.

నటరాజన్‌వచ్చేదాకా ఆగాను. ఇద్దరం బయల్దేరే సమయానికి వాన తగ్గింది.

క్రిస్టా ఇల్లు మా ఇంటికి దగ్గరే. నడిచి అక్కడికి చేరుకున్నాం.

క్రిస్టా మునుపటిలాగే అభిమానంగా ఆదరించింది. నా అలవాట్లు గుర్తుంచుకుని పాలు సెర్వ్ చేసింది.

స్లైడ్స్ చూస్తే – పెరూ ఇండియాకంటే బాగా వెనుకబడిన దేశమని అర్థమైంది. దుకాణాల్లో అమ్మే సరుకులమీద ఈగలు వాలిన దృశ్యం వెగటుగా ఉంది.

అక్కడి పేదరికం చూసి తట్టుకోలేకపోయానని కాసింబర్గ్ చెబుతుంటే, ఆమె కళ్లలో తిరిగిన నీళ్లు అందుకు సాక్ష్యంగా బయటికొచ్చాయి. ఐతే అది స్లైడ్స్ చూసిన కాసేపే. ఆ తర్వాత ఆమె హుషారుగా ఉంది.

మాటల సందర్భంలో తెలిసింది – క్రిస్టాకి భర్త లేదని. పదేళ్ల కొడుకుమీదే ఆమె ప్రాణాలన్నీ.

పలకరింపులో, ఆదరణలో – క్రిస్టా లూథర్ ఆతిథ్యం ఇండియాని గుర్తు చేసింది. అమె పరిచయం కూడా నా అదృష్టం అనుకున్నాను.

అప్పటికి నా బెర్లిన్‌ప్రయాణానికి టికెట్ వచ్చేసింది. ఆ మాట క్రిస్టాకి చెప్పాను. "మన పరిచయం చాలా ఆలస్యంగా మొదలైంది" అందామె బాధగా.

వీడ్కోలు తీసుకుంటుంటే మా పరిచయం మరికాస్త ముందు జరిగితే బాగుణ్ణని నాకూ అనిపించింది.

## ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి

మా పరీక్షలు సెప్టెంబర్‌న అయ్యాయి. ప్యాసైనా, ఫెయిలైనా మాకొకటే ఐనా – ప్రిపరేషన్లో అశ్రద్ధ చూపినవారు తక్కువే. నేనూ బాగానే వ్రాశాను. మరి మాకు క్లాసులుండవు. ఆ సందర్భంలో ఆ రోజు సాయంత్రం క్లాస్‌మేట్సు అంతా కలిసి పార్టీ చేసుకున్నాం.

మ్యాయా పరీక్షలంత బాగావ్రాయలేదుట. టీచర్ షిమాంగ్ పాఠాలు బాగా చెప్పకపోవడమే కారణమని ఇంచుమించు టీచరు మొహంమీదే చెప్పాడు. షిమాంగ్ నొచ్చుకున్నాడనిపించింది. ఇండియన్సంతా కలిసి ఏకకంఠంతో షిమాంగ్ పాఠం చెప్పే విధానాన్ని మెచ్చుకున్నాం. టీచరు మొహం వెలిగింది.

పార్టీ ఏర్పాట్లు శర్మ, మ్యాయా, బ్రిట్టీ అనే అమ్మాయి చేశారు. పార్టీకి నేపథ్యంగా ఆహ్లాదకరమైన పాశ్చాత్య సంగీతం వినిపించారు. కేక్, వేరుశనగ పప్పు, చిప్సు, బిస్కట్సు, వైన్, కాఫీ, ఫలరసాలు సెర్వ్ చేశారు. ఫలరసాలకు బొత్తిగా డిమాండ్ లేక, కొన్న కాసిని ప్యాకెట్లే మిగిలిపోతే, అవి నాకిచ్చి పట్టుకుపొమ్మన్నారు.

పార్టీ చాలా సరదాగా జరిగింది. ఐతే ఇంకా అది వీడ్కోలు కాదు.

మా పరీక్షా ఫలితాలు సెప్టెంబర్‌న వచ్చాయి. ఆ ఉదయం మాకు ఎప్పటిలాగానే ఇన్‌స్టిట్యూట్‌లోనే ఫలహారం. తర్వాత మాకు సర్టిఫికెట్లు పంచారు. కొంతమందిమి కలిసి మా గురువు షీమాంగ్‌కి 46 డాలర్లు పెట్టి ఒక వాచీ, అదికాక ఒక విస్కీ బాటిల్ కానుకగా ఇచ్చాం. మనిషికి మూడు మార్కులు పడింది. నేను ఆ నెలకి ఎస్సెన్ కార్టేలు (మీల్స్ టికెట్లు) రెండే రెండుంచుకుని మిగిలిన నాలుగూ ఇచ్చేస్తే ఇన్‌స్టిట్యూట్‌వారు 18 మార్కులు వెనక్కిచ్చారు. హెన్నీ బెక్కర్ హొటల్లో భోజనం చేశాను.

ఆ సాయంత్రం చివరిసారిగా ఇన్‌స్టిట్యూట్‌లో స్నానం చేశాను. స్నానశాల తెర లాగి ఎవరైనా చూస్తారన్న బెంగ నాకప్పుడు లేదు. 'వియ్ మిస్ ఆల్ ది ఫన్' అనిపిస్తోంది. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌చదువులమ్మ చెట్టు నీడలో కలిసిన మాకక్కడ అదే చివరి రోజు.

సాయంత్రం నాలుగుకి అబ్‌షీడ్ (ఫేర్‌వెల్) పార్టీ ఉంది. అక్కడ కోలా తాగుతుంటే, "రావ్, నువ్వేం మారలేదు" అన్నాడు మ్యాయా. ఆ మాటలో హేళన లేదు. వీడలేమంటు, వీడుకోలంటు వెళ్లిపోతున్నామన్న భావన ఉంది.

## *ప్రయాణ సన్నాహాలు*

నా ప్రయాణం సెప్టెంబర్ 29న ఐతే, అందుకు సన్నాహాలు వారం రోజులు ముందరే మొదలయ్యాయి.

జర్మనీలో పౌరులకైనా, విదేశీయులకైనా రాకపోకలకు ఓ రికార్డుంటుంది. ల్యూనబర్గ్‌లో అడుగెట్టగానే గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌వారు మాచేత అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్) ఫారాలు నింపించారు. ల్యూనబర్గ్ వదిలేముందు వారు మాచేత అబ్‌మెల్డుంగ్ (డిరిజిస్ట్రేషన్) ఫారాలు నింపించారు. అవుంటే తప్ప అక్కడ మా ఉనికి చట్టబద్ధం కాదు. ఊరు మారితే అబ్‌మెల్డుంగ్, ఊరు చేరితే అన్‌మెల్డుంగ్ అక్కడ తప్పని సరి.

రాత్రిళ్లు ఓవర్‌టైం చేసి ఆబగా పాటలు రికార్డింగ్‌చేసుకున్నాం. ఇళ్లకు ఉత్తరాలు వ్రాసుకున్నాం. క్యాసెట్లలాంటివి పార్సెల్సులో పంపాం.

యాకేల్ ఇంట్లో పియానో ఉంది. ఆమె అప్పుడప్పుడు పియానో వాయిస్తూండడం తెలుసు. బయల్దేరేముందు ఆమె జ్ఞాపకంగా ఆమె పియానో సంగీతాన్ని రికార్డు చేసుకుంటానన్నాను. ఎంత ఉత్సాహపడిందో చెప్పలేను. ఆ ఉత్సాహంలో నేననుకున్నకంటే చాలా ఎక్కువసేపే వినిపించింది. ఆ విషయం రికార్డింగు అయ్యేదాకా నాకూ తెలియలేదు. ఐతే ఆమె సంగీతంకంటే ఎక్కువగా ఆమె ఉత్సాహం నన్ను అలరించింది.

ప్రయాణానికి రెండు రోజులముందే పెట్టె సద్దుళ్లు మొదలెట్టాను. నా సూట్‌కేస్ పెద్దదేంకాదు. నాకున్న సామానూ ఆట్టే లేదు. ఎటొచ్చీ కూడా తెచ్చుకున్న ఆవకాయ, టమేటా ఊరగాయ ఉన్నాయి. వాటిలోంచి ఊట లీకవకుండా జాగ్రత్త తీసుకోవాలి. అందుకని రోజుకోసారి వాటి పొజిషన్‌మార్చి చూసుకునేవాణ్ణి.

సెప్టెంబర్ 27న ఫ్రౌ హెన్నీబెక్కర్ హౌటల్లో చివరిసారిగా భోజనం. ఆ రోజక్కడ నేనొక్కణ్ణే ఇండియన్ని. మిగతా ఇండియన్స్‌కి వేరే ప్రోగ్రాంలున్నాయి. ఆమెకు సంతకాలతో ఉన్న ఇండియన్స్ ఫొటోలు ఇచ్చాను. వీడ్కోలు చెబుతున్నప్పుడు ఆమె షేక్‌హ్యాండిస్తూ ఓసారి నా చెయ్యి నొక్కి వదిలింది. ఆ స్పర్శలోని ఆత్మీయతానుబంధం అనుభవైక వేద్యం.

స్నానానికి వంటిమీద బట్టలుండకూడదని ఖచ్చితమైన నిబంధన ఉండడంవల్ల అన్నాళ్లూ కూర్‌పార్కులో స్నానం చెయ్యలేదు. అక్కడ కూడా ఒకసారైనా స్నానం చెయ్యాలనుకుని, ప్రయాణానికి ఓ రోజు ముందు వెళ్లాను. అక్కడ డబ్బు కట్టి టోకెన్‌తీసుకోవాలి. టోకెన్ ఉంటేనే లోపలకెళ్లగలం, లోపల్నుంచి బయటకు రాగలం. ఆ రోజు నాకొచ్చిన టోకెన్‌నంబరు 313. విశేషమేమిటంటే జర్మనీ వచ్చేముందు భువనేశ్వర్లో నేను ఖాళీ చేసిన క్వార్టర్ నంబర్ అది. న్యూమరాలజీ నాకేదో శుభసంకేతాన్ని ఇస్తోందనిపించింది.

ఇంతకీ మావాళ్లు హడలగొట్టేశారు కానీ, నేను నా చారల డ్రాయరుతోనే స్నానం చేశానక్కడ. ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఎటొచ్చీ ఆ స్నానం ఒక గొప్ప అనుభవం. అంతవరకూ స్నానంలో అంత దివ్యానుభూతి కలగలేదు. ఆ తర్వాత అంతా నటరాజన్ ఇంట్లో కలుసుకున్నాం. అక్కడే భోజనాలు.

వంట సదుపాయమున్న ఇండియన్సంతా తలో వంటకం తెచ్చారు. నటరాజన్ ఉప్మా చేశాడు. మధ్యాహ్నం 12 నుంచి, రాత్రి 9 దాకా ఏకదాటిగా పాటల రికార్డింగు కొనసాగింది. మాటలమధ్యలో ఫ్రౌ యాకేల్‌కి వీడ్కోలు కానుకగా ఏదైనా ఇండియన్ ఐటమ్ ఇవ్వలేకపోతున్నందుకు నేను అదేపనిగా బాధ పడుతుంటే – రామచంద్ర నాకు తన దగ్గరున్న ఓ తాజమహల్‌బొమ్మ ఇచ్చాడు. ఆ సందర్భంలో ఆ దేశంలో అంతకు మించిన ఔదార్యమేముంటుంది? నా మనసు అతడి పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

రాత్రి ఇంటికొచ్చేరికి పదిన్నర. అప్పటికే నాకా ఊరితో, ఆ ఇంటితో, ఆ పరిసరాలతో ఏదో తెలియని అనుబంధం ఏర్పడిందేమో – ల్యూనబర్గులో నాకది తుది రాత్రి అంటే ఏదోలా అనిపించింది.

తెల్లారితే సెప్టెంబర్ 29. నేను బెర్లిన్‌కి ప్రయాణమవాల్సిన రోజు.

## టాటా వీడుకోలు

ఆరోజు ఉదయమే లేచాను. ఆ రోజే నా ప్రయాణమని తెలిసి మనసెందుకో బాధగా మూలిగింది. వాచి చూసుకుంటే ఇంకా ఐదే అయింది. కాలం ఆగిపోయినట్లుందే అనుకున్నాను కానీ, ఆగింది కాలం కాదు, వాచి. రేడియో వింటే వాళ్ళు చెప్పిన టైమునిబట్టి కాలం ఆగిపోయి గంట దాటిందని అర్థమైంది. "ఇలా ఆగిపోతుంటే ప్రయాణంలో నాకు చాలా ఇబ్బంది" అని హెచ్చరించి వాచిని సరిచేశాను.

మరోసారి సామాను సద్దబోయాను. సూట్‌కేసు చిన్నది. సామానూ తక్కువ. సద్దడానికి ఎంతో సేపు పట్టలేదు.

చకచకా తెమిలి మెట్లు దిగి ఫ్రౌ యాకేల్‌ఇంటి తలుపు తట్టాను. ఆమెకు తాజమహల్‌ఇచ్చాను.

ఆమెకి తాజమహల్‌తెలుసు. చాలా సంబరపడింది. "థాంక్యూ రామచంద్రా" అనుకున్నాను మనసులో.

ఆమె నాకో పర్సు ఇచ్చింది. దానిమీద ల్యూనబర్గ్ బొమ్మ ఉంది. ఇంకా ఆమె తన ఫొటోలు కొన్ని ఇచ్చింది. జిమ్మర్ సూహే (ఇల్లు వెదకడానికి) పనికొస్తుందంటూ నాకో కాగితమిచ్చింది. అది ఆమె నాకిచ్చిన కండక్ట్ సర్టిఫికెట్. అందులో ఆమె నన్ను పొగిడిన తీరు ప్రబంధకవులకు మార్గదర్శకం. చదివి పొంగిపోయాను.

థాంక్స్ చెప్పి, 9.45కి టాక్సీని పిలవమన్నాను. కళ్లలో నీళ్లు తిరిగితే ఆమె చూడకూడదని గిరుక్కున వెనక్కి తిరిగాను. నా వెనుక కదలికల్ని బట్టి ఆమె కూడా వెనక్కి తిరిగిందని అర్థమైంది.

9.45కి టాక్సీ వచ్చింది. సూట్‌కేస్ టాక్సీలో పెట్టించి నేనూ టాక్సీలో కూర్చుని యాకేల్‌కి టాటా చెప్పాను.

"ఔఫ్ వీడర్‌జీహెన్!"

రోజూ బై చెప్పడానికి మామూలుగా అనుకునే ఆ తేలిక మాట – ఆ క్షణంలో ఎంతో బరువుగా తోచింది. జీవితంలో మళ్లీ ఆ ఊరినీ, ఆమెనీ చూస్తాననుకోను.

నా కళ్లలో నీళ్లు తిరిగాయి. యాకేల్‌కూడా కళ్లు తుడుచుకోవడం గమనించాను. సెంటిమెంటుకీ, అనుబంధాలకీ దేశవిదేశ విభేదముండదు కదా అనుకున్నాను.

టాక్సీలో నటరాజన్ ఇంటికెళ్లాను. అతనితోపాటు నేనూ అతని హౌస్‌ఫ్రౌకి బై చెప్పాను. ఆమె అభిమానంగా షేక్‌హ్యాండిచ్చింది.

నటరాజన్ నేనూ కలిసి అదే టాక్సీలో రైల్వే స్టేషను చేరుకున్నాం. టాక్సీకి ఎనిమిది మార్కులయింది.

స్టేషన్లోకెడుతూ జాగ్రత్తకోసం ఓసారి పాంటు జేబు తడిమాను.

నాలుగు నెలల్లో నేనక్కడ మిగుల్చుకున్న పదకొండువందల మార్కులున్న బరువైన జేబది. అప్పట్లో నాకది చాలా పెద్ద మొత్తం.

క్రమంగా స్టేషనుకి దేవదార్, కొరియా, రామచంద్ర, లాల్, గెసుండ్ గుప్తా, శర్మలు వచ్చారు. వాళ్లప్పుడు మిత్రుల్లా కాక దగ్గర బంధువుల్లా అనిపించారు.

ట్రయిన్‌సరిగ్గా సమయానికి వచ్చింది. వెంటనే ఎక్కాం. ల్యూనబర్గ్‌కి చెయ్యూపి బై చెప్పాం.

అక్కడి ప్రమాణాల్ని నిలబెడుతూ, సరిగ్గా పదకొండు గంటల పదహారు నిముషాలకు ట్రైన్‌బయల్దేరింది.

(మొదటి భాగం సమాప్తం. రెండో భాగం వచ్చేనెల నుండి)

Post your comments